యోగాతో ఆరోగ్యం, ఆనందం

యోగాభ్యాసంతో ఆరోగ్యం, ఆనందం సొంతమవుతాయని యోగా గురువులు ఉద్ఘాటించారు. నిరంతర యోగ సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని యోగా కేంద్రాలతో పాటు విద్యాసంస్థల్లో, పార్కుల్లో, కార్యాలయాల్లో యోగాసనాలు వేశారు. యోగా చేయడం వల్ల చేకూరే ప్రయోజనాలను నిపుణులు సాధకులకు తెలియజేశారు.


ఆటోనగర్ వాసీవాలో యోగాసనాలు వేస్తున్న ఎంఎస్‌ఎంఈ అధికారులు, పారిశ్రామిక వేత్తలు


భెల్‌లో జ్యోతి వెలిగిస్తున్న యోగా అసోసియేషన్ ప్రతినిధి గోపిశెట్టి ఆదినారాయణ

అక్కిరెడ్డిపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించారు. ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) లో ఎంఎస్‌ఎంఈ, వాసీవా సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాయి. యోగా శిక్షకుడు, ఎంఎస్‌ఎంఈ విశ్రాంత ఏడీ అప్పలరాజు పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్‌ఎంఈ అధికారులతో యోగాసనాలను వేయించారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ ఏడీలు చంద్రమౌళి, ప్రభాకర్ కుమార్, కె.ఎల్.ఎస్.రెడ్డి, శ్రీను, మూర్తి, ఎస్.ఎల్.ఎన్.కుమార్, సిబ్బంది, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కార్యదర్శి రామ్‌ప్రసాద్, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, ఐలా మాజీ అధ్యక్షుడు వై.సాంబశివరావు, లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర కార్యదర్శి ఎ.కె.బాలాజీ, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

- భెల్ (హెచ్‌పీవీపీ)లో ఫ్రెండ్స్ పవర్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. పలువురు యోగా శిక్షకులు యోగాసనాలు సాధన చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధి గోపిశెట్టి ఆదినారాయణ, యోగా ట్రైనర్ గంట్ల దేముడు, పి.శ్రీనివాస్, ఆర్.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.
- 68వ వార్డు మిందిలోని ప్రభుత్వ హోమియో వైద్యశాలలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో శ్రీ శాంతి యోగా కేంద్రం గురువు శ్రీను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.
- అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో పీడీ ఇస్మాయిల్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- మింది జెడ్పీ హైస్కూల్‌లో పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఎస్‌ఆర్ సహకారంతో యోగా డే నిర్వహించారు. యోగా ట్రైనర్ విజయలక్ష్మి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, కోరమండల్ ఇంటర్నేషనల్ సీఎస్‌ఆర్ ప్రతినిధి రాజీవ్, శివగణేష్, రత్నకుమారి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నడుపూరు హైస్కూల్లో..

పెదగంట్యాడ: యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ,అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం అధ్యక్షుడు మీసాల శివ గణేశ్వరరావు అన్నారు. ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాన్ని కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ప్రారంభించారు. ట్రైనర్లు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ప్రాణాయామం, ధ్యానం చేయించారు. ఎంఈవోలు శ్రీనివాసరావు, రమణాజీ,యోగా ట్రైనర్ ఏవీ విజయలక్ష్మి, నీలకంఠం, దేవిక తదితరులు పాల్గొన్నారు.

- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సమతానగర్ ఎల్‌ఐజీ పార్కులో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యోగాసనాలు వేశారు. అనంతరం వాటిపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. యోగా ట్రైనర్ కొల్లి ఈశ్వరరావు, విక్టర్ రాజు, మన్మధరావు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో..

స్థానిక భవిత కేంద్రం వద్ద ప్రత్యేక అవసరాల పిల్లలకు యోగాపై శిక్షణ ఇచ్చారు. భవిత కేంద్రం నిర్వాహకులు ఎం. సూర్యనారాయణ, జయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసరావు, రమణాజీ పాల్గొని యోగా, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. జీలకర్ర రమణ, లక్ష్మి, భువనేశ్వరి, విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.


నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

యోగాతో జీవనశైలిలో మార్పులు

అగనంపూడి: యోగాతో మనిషి జీవన శైలిలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటాయని బ్రహ్మకుమారీస్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ బికె సోమేశ్వరి, మౌంట్ అబూ ప్రతినిధి రాజయోగి బికె చంద్రశేఖర్ భాయీజీ అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్ బాబు, అగనంపూడి ఇన్‌చార్జి బికె రామకోటి, ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, వి.వరహాలు, కిడిమి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

- దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో యోగా ట్రైనర్ అనిత మాట్లాడుతూ యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో సుందర్‌రామన్, డీన్లు సతీష్, రాంబాబు పాల్గొన్నారు.
- దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా ట్రైనర్ అనితాదేవి విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, యోగా కోచ్ లిప్పీ బిళ్లా, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ సత్యలక్ష్మి పాల్గొన్నారు.
- లంకెలపాలెం, పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. పాఠశాలల హెచ్‌ఎంలు రౌతు నాగేశ్వరరావు, కృష్ణ, ఉపాధ్యాయులు పెద్దినాయుడు, కె.రమణ, లక్ష్మి, ఎన్.వి.రమణ, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- ఉక్కునగరం: అరబిందో ఐడియల్ హైస్కూల్‌లో యోగా టీచర్లు విద్యార్థులతో ఆసనాలు చేయించారు.

అమరావతి పార్కులో..

గాజువాక : స్థానిక అమరావతి పార్కులో బీజేపీ నాయకులు యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మందితో యోగాసనాలను సాధన చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిరసపల్లి నూకరాజు, మారిశెట్టి వెంకట రమణ, దోసపాత్రుని నాగేశ్వరరావు, తూటా సోమశేఖర్, రోహిణి, మాడుగుల ప్రసాద్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

- గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఉపయోగపడే విధానాన్ని 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు వై.శ్రీలక్ష్మి, రాజేంద్రబాబు, వి.పల్లవి, పి.ప్రదీప్, న్యాయవాదులు పాల్గొన్నారు.
- యోగా దినోత్సవాన్ని స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో, రవీంద్ర భారతి స్కూల్‌లో ప్రియదర్శిని అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
- ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో విద్యార్థులతో యోగాసనాలతో పాటు ప్రాణాయామం సాధనం చేయించారు. పాఠశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ ప్రమీలా ముఖర్జీ, బ్రహ్మకుమారి రాజయోగినులు చంద్రశేఖర్, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


మింది హోమియో వైద్యశాలలో యోగా గురువు శ్రీనుకు జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ శ్రీదేవి


మింది హైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


సమతానగర్ ఎల్ఐజీ పార్కులో యోగాసనాలు వేస్తున్న సాధకులు


యోగా చేస్తున్న అరబిందో స్కూల్ విద్యార్థులు


అమరావతి పార్కులో యోగాభ్యాసం చేస్తున్న సాధకులు


యోగాసనాలు సాధన చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

ఉక్కు ఉద్యోగుల యోగా సాధన

ఉక్కునగరం: ఉక్కు ఇండోర్ స్టేడియంలో యోగా సెషన్‌ను స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి.పాండే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు ప్రతీ ఒక్కరూ యోగా సాధన చేయాల్సి ఉందన్నారు. యోగా గురువులు ఎ.కనకరావు, ఎ.శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు గణేష్, ప్రసాద్, స్వతంత్ర డైరెక్టర్లు సునీల్ కుమార్ హీరానీ, ఘనశ్యామ్ సింగ్ పటేల్, ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ ఎ.పి.నవీన్‌కుమార్, పలువురు సీనియర్ అధికారులు, ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.


ఉక్కు స్టేడియంలో యోగా చేస్తున్న ఉద్యోగులు


ప్రియదర్శిని అకాడమీలో విద్యార్థుల యోగాసనాలు


లంకెలపాలెం హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


అగనంపూడి కళాశాలలో బికే సోమేశ్వరి, చంద్రశేఖర్‌లను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్



విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ ఇస్తున్న యోగా గురువు


భవిత కేంద్రం వద్ద ప్రత్యేక అవసరాల పిల్లలతో యోగా చేయిస్తున్న యోగా నిపుణులు

క్లుప్తంగా

సౌత్ జోన్ పోలీసుల మెగా రక్తదాన శిబిరం


డీసీపీకి జ్ఞాపిక అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

ఉక్కునగరం: నగర సౌత్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో సెక్టార్-9 ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డీసీపీ-2 మోకా సత్తిబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేస్తే ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లే అన్నారు. చాలామందికి సకాలంలో రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌లో ఈ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరంలో 45 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అంతకు ముందు పోలీసు అధికారులు, సిబ్బంది యోగా చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, పలువురు సీఐలు, సౌత్ పరిధిలోని సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం నేడు

అగనంపూడి: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం అగనంపూడి జగన్నాథస్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం జరిపించనున్నట్టు ఆలయ పండితులు గురు సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం పది గంటలకు 108 కొబ్బరి బొండాల జలాలతో అభిషేకం చేయించనున్నట్టు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ


గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గిరి ప్రదక్షిణ జరిగింది. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఆద్యంతం భక్తిప్రపత్తులతో సాగింది. ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరి స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి వినతి


ఈఈకి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

అగనంపూడి: అగనంపూడి, లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఈపీడీసీఎల్ ఈఈ దృష్టికి తీసుకువెళ్లారు. ఆ ప్రాంతంలో వినియోగానికి అవసరమైన సబ్‌స్టేషన్లు లేకపోవడం వల్ల తరచూ విద్యుత్ సమ స్య తలెత్తుతోందని తెలిపారు. లో ఓల్టేజీ వల్ల విద్యుత్ ఉపకరణాలు దెబ్బతింటున్నాయని, సమస్య పరిష్కరించాలని వినతిపత్రంలో పే ర్కొన్నారు. అగనంపూడిలో టోల్‌గేటుకు కూడా విద్యుత్ కనెక్షన్ తొలగించాలని కోరారు. ఆయన వెంట సింహాచలం తదితరులున్నారు.

వేతనాల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యం


- ఇలాగే కొనసాగితే ఉక్కు సీఎండీ, ఉన్నతాధికారుల ఇళ్ల ముట్టడి
- ఉక్కు కార్మిక సంఘాల నాయకుల హెచ్చరిక
- 1226వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు


అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల వేతనాలను తక్షణమే చెల్లించకపోతే సీఎండీతో పాటు ఉన్నతాధికారులను తిరగనిచ్చేది లేదని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు రిలే దీక్షా శిబిరంలో 1226వ రోజు, శుక్రవారం డబ్ల్యూఎండీ, టీటీఐ, టౌన్ అడ్మిన్, యుటిలిటీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.ఆదినారాయణ, డీసీహెచ్. వెంకటేశ్వరరావు, వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. కార్మికుల వేతనాల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. యాజమాన్య వైఖరి వల్ల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఏ క్షణమైనా ఉక్కు సీఎండీ, ఉన్నతాధికారుల ఇళ్లను ముట్టడి చేయనున్నామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి నరేంద్ర, వరప్రసాద్, అప్పలరాజు, శివ, కణితి అప్పారావు, శ్రీను, గేదెల ఈశ్వరరావు, రవీంద్ర పాల్గొన్నారు.


దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

నృసింహ స్వామికి వైభవంగా గరుడ సేవ

- పాల్గొన్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, ఈవో శ్రీనివాసమూర్తి
- పోటెత్తిన ఒడిశా భక్తులు


అమ్మవార్లు వేంజేసిన పల్లకీ మోస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, ఈవో శ్రీనివాసమూర్తి


గరుడసేవ చేస్తున్న అర్చకులు, పాల్గొన్న లక్ష్మీకాంత్ నాయక్‌దాస్, ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిర్వహించిన గరుడ సేవలో ఒడిశా భక్తులు తరించారు. లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ స్వామికి ఈసేవను జరిపించారు. భువనేశ్వర్, పట్టుపురం, బరంపురం, పూరి, రాయగడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ సేవకు హాజరయ్యారు. సాయంత్రం అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అలంకరించి వెండి గరుడ వాహనంపై అధిష్ఠించారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పల్లకీలో వేంచేయజేసి గరుడ సేవ నిర్వహించారు. వింజామరతో లక్ష్మీకాంత్ నాయక్ దాస్ స్వామికి సేవలందించారు. స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈసేవ నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి సతీసమేతంగా పాల్గొన్నారు.

మురికివాడను పరిశీలించిన డీఎంహెచ్‌వో

మహారాణిపేట : నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటే వ్యాధులను నిర్మూలించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం అప్పుఘర్ ప్రాంతంలోని మురికివాడను సందర్శించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్, ఇతర సబ్ యూనిట్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి వారం ఫ్రైడే డ్రై డే పాటించాలని తెలిపారు. దోమతెరలు వాడాలని, దోమల వల్ల మలేరియా, డెంగ్యూ రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జీటీడబ్ల్యూ పోస్టుమెట్రిక్ గర్ల్స్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులు, వార్డెన్లకు పలు సూచనలు చేశారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు స్పందన


సీపీకి వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

అల్లిపురం : నగర పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సిబ్బంది గ్రీవెన్స్‌కు స్పందన లభించింది. శాంతి భద్రతలు, ట్రాఫిక్, క్రైమ్, ఏఆర్‌కు సంబంధించి 30 మంది సిబ్బంది శాఖాపరమైన సమస్యలపై నేరుగా సీపీ డాక్టర్ రవిశంకర్‌కు వినతులు అందజేశారు. ఇంక్రిమెంట్లు, డిప్యుటేషన్, ఆరోగ్య సమస్యలు, ప్రమోషన్లకు సంబంధించి అందిన వినతులపై స్పందించిన సీపీ వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పార్సిళ్లను పరిశీలించాలి


పార్సిల్ సర్వీస్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏడీసీపీ (సెబ్) శ్రీనివాసరావు

విశాఖ సిటీ : కస్టమర్ల పార్సిళ్లను నిర్వాహకులు తప్పకుండా పరిశీలించాలని ఏడీసీపీ (సెబ్) బి.శ్రీనివాసరావు పార్సిల్ సర్వీస్ ఆఫీస్ మేనేజర్లకు సూచించారు. నగరంలో కొన్ని పార్సిల్ సర్వీస్ సంస్థల ద్వారా తెలిసీ తెలియక గంజాయి అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం మేరకు శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో ఆయా సంస్థల నిర్వాహకులు, మేనేజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా నేరమని, తెలిసినా, తెలియక పోయినా పార్సిళ్లలో డ్రగ్స్ లేదా గంజాయి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ (సెబ్) బి.శ్రీనివాసరావు, ఏసీపీ (సెబ్) సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ రాజుల నాయుడు, పార్సిల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

రోడ్డు ప్రమాదంలో ఉక్కు రిటైర్డ్ ఉద్యోగి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పవర్‌గ్రిడ్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి ఒకరు మృతి చెందారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేసిన పైలా నాగార్జునరావు(62) కూర్మన్నపాలెంలో ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కారులో టౌన్‌షిప్ వెళ్లారు. అక్కడి నుంచి దేశపాత్రునిపాలెం మార్గంలో వెళ్తుండగా కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం ఒరిగిపోవడంతో పాటు కారు ముందు భాగం నుజ్జయింది. ఈ ఘటనలో నాగార్జునరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనను ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్టీల్ ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నాగార్జునరావు మృతదేహం

'నీట్' లీకేజీపై నిరసన జ్వాల

సీతమ్మధార: నీట్-2024 పరీక్ష పేపర్ లీకేజీపై నిరసనలు కొనసాగుతున్నాయి. ఏఐఎస్ఈసీ ఆధ్వర్యంలో నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం జీవీఎంసీ గాంధీ పార్కులో ఆందోళన చేపట్టారు. ఏఐఎస్ఈసీ రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్‌టీఏను రద్దు చేయాలని, నిజాయతీగా పరీక్ష రాసిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని, నీట్ కుంభకోణంలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అధ్యాపకులు శంకరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యవతి, ఎస్.గోవింద్, పాల్గొన్నారు.


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఈసీ ప్రతినిధులు

రైతుబజార్లలో పార్కింగ్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: కంచరపాలెం, గోపాలపట్నం రైతుబజార్లలోని ఖాళీ స్థలంలో పార్కింగ్ ప్రాంతం నిర్వహణ కోసం ఒక ఏడాదికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. జులై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు రూ.10 వేల ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతుబజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22 నుంచి 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట లోపు అందజేయాలన్నారు. 28న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇస్తామని వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్ నంబర్ 8-202/2, ఆర్ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం -530029కు అందించాలన్నారు. వివరాలకు 90308 19082 నంబర్‌లో సంప్రదించాలని జేసీ కోరారు.